క్లుప్తంగా

వైభవం.. చౌడేశ్వరిదేవి పల్లకోత్సవం



పల్లకీసేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి మంగళహారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీపై కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

కొలిమిగుండ్ల: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో రోడ్డు సేఫ్టీపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో ఆసక్తిగా పాల్గొని రోడ్డు భద్రతపై వివిధ రకాల రూపాల్లో చిత్రాలు గీశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రామ్‌కో ఏజీఎం సెంథిల్‌కుమార్ బహుమతులు అందజేశారు. రోడ్డు ప్రమాదాలు, భద్రతపై అవగాహన కల్పించేందుకే విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

ఆలయంపై కూలిన చెట్టు



ఆలయంపై పడిన చెట్టు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లె ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న సుంకులమ్మ ఆలయంపై చెట్టు విరిగిపడింది. గాలులు లేకపోయినా ఒక్కసారిగా పెద్ద కొమ్మ విరిగి పడడంతో ఆలయం పాక్షికంగా దెబ్బతింది. గుడి పక్కనే గ్రామస్తులు విశాలమైన అరుగు నిర్మించుకున్నారు. ఖాళీ సమయాల్లో అక్కడే సేదతీరుతుంటారు. చెట్టు విరిగిపడిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



వ్యాయామ ఉపాధ్యాయుడు బాషాను అభినందిస్తున్న తోటి ఉపాధ్యాయులు

సంజామల: అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు సంజామల ప్రభుత్వ పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు బాషా ఎంపికయ్యారు. ఈనెల 4న కర్ణాటక రాష్ట్రం బెంగళూరు కంఠీరవ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 40 ప్లస్ విభాగంలో హైజంప్‌లో నాలుగో స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారు. త్వరలో ఇండోనేషియా దేశంలో జరిగే అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో భారతదేశం తరఫున వ్యాయామ ఉపాధ్యాయుడు ఆడనున్నారు. ఈ మేరకు సంజామల ప్రభుత్వ పాఠశాల టీచర్లు శుక్రవారం వ్యాయామ ఉపాధ్యాయుడు బాషాను అభినందించారు.

మోడల్ స్కూల్‌కు సామగ్రి అందజేత



సామగ్రి అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

డోన్ టౌన్: స్థానిక మోడల్ స్కూల్‌కు మారెళ్ల రాజశేఖర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో వివేకానంద సేవా సమితి సభ్యులు అవసరమైన సామగ్రిని అందజేశారు. శుక్రవారం స్కూల్‌కు వెళ్లి రూ.8 వేల విలువైన ఆరు చార్జింగ్ లైట్లు, ఐదు వాటర్ క్యాన్లు, ట్యూబ్‌లైట్లతో పాటు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ కోతల సమయంలో చార్జింగ్ లైట్లు, వేసవిలో మంచినీటి నిల్వ కోసం వాటర్ క్యాన్లు అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్ మోహన్ తెలిపారు. సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, శ్రీనివాసుల శెట్టి, సభ్యులు కుళ్లాయప్ప, జయశీల గుప్త, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో ఉన్న 10 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో విద్యుత్ ఏడీ మధుసూదన్‌రెడ్డి, రూరల్ ఏఈ శ్రీనివాసులు స్పందించారు. విద్యార్థులకు పరీక్షలను దృష్టిలో ఉంచుకుని 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

రాజకీయ స్వార్థం..

అభివృద్ధికి శాపం

- రూ.5కోట్లతో నిర్మించిన స్పోర్ట్స్‌క్లబ్, క్లబ్‌హౌస్ నిరుపయోగం
- రాజకీయ కక్ష్యతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు నిధులు మంజూరు చేయని కమిషనర్
- తప్పుడు పత్రాలతో క్లబ్ నిర్వహణను చేజిక్కించుకునేందుకు అధికార పార్టీ కుట్ర
- కుట్రలను భగ్నం చేసి త్వరలోనే వినియోగంలోకి తెస్తాం
- మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్



క్లబ్‌హౌస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్కు



హాల్లో ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్, క్యారమ్స్



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.5కోట్లతో నిర్మించిన క్లబ్‌హౌస్, స్పోర్ట్స్‌క్లబ్ సముదాయం

డోన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్రీడలతో పాటు టూరిజం డెవలప్‌మెంట్‌కు పెద్దపీట వేసింది. పార్కులు, రెస్టారెంట్ల ఏర్పాటుతో అన్నివర్గాల ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేసింది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గాన్ని పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు రూ.5 కోట్లతో నగరవనం, బేతంచెర్ల మండలం ఎర్రజ్వాల గుహలు, ప్యాపిలి మండలం వాల్మీకి గుహల అభివృద్ధికి రూ.3కోట్ల చొప్పున ఖర్చు చేసింది. ప్యాపిలి మండలం వెంగలాంపల్లె, డోన్ మండలం వెంకటాపురం తుమ్మలచెరువుల్లో బోటింగ్ షికారుతో పాటు రెస్టారెంట్‌ను కూడా నిర్మించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ కక్షతో వాటి అభివృద్ధితో పాటు నిర్వహణను గాలికొదిలేసింది.

అధునాతనంగా స్పోర్ట్స్ క్లబ్ నిర్మాణం

డోన్ రైల్వేజంక్షన్‌కు అత్యంత సమీపంలో రూ.5 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అధునాతనంగా నిర్మించారు. 15 సెంట్ల యూనియన్ క్లబ్ సొసైటీ స్థలంలో బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోని రెస్టారెంట్, మినీ ఫంక్షన్ హాల్‌లను తలపించే రీతిలో క్లబ్‌హౌస్‌ను తీర్చిదిద్దారు. జిమ్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ పోటీలకు అనువుగా ప్రత్యేక హాళ్లు, మినీ ఫంక్షన్‌లకు సరిపడే విధంగా నాలుగు సూట్లు, ఆధునిక మరుగుదొడ్లు, మూత్రశాలలు, ఫంక్షన్ హాల్ నిర్మించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు మున్సిపాలిటీ రూ.5 లక్షలను చెల్లించేందుకు తీర్మాణం కూడా చేసింది. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఫర్నీచర్, జిమ్, టేబుల్ టెన్నిస్, స్నూకర్, క్యారమ్స్ పరికరాల కొనుగోలుకు మంజూరైన రూ.18 లక్షలు కూడా ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఆధునిక వసతులతో నిర్మించిన ఈ ప్రాంగణం అక్కరకు రాని చుట్టంగా మిగిలిపోయింది.



మినీ ఫంక్షన్‌హాల్



జిమ్ సెంటర్

సొసైటీ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి



డోన్‌లో నిర్మించిన స్విమ్మింగ్ పూల్, క్లబ్‌హౌస్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహణ డోన్ యూనియన్ క్లబ్ సొసైటీ ఆధ్వర్యంలోనే ఉంటుందని భావించాం. అయితే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం రెస్టారెంట్‌తో పాటు పైరెండింటిని తమ గుప్పిట్లోకి తీసుకోవాలని చూస్తుండడం అత్యంత దుర్మార్గమైన చర్య. వీటి నిర్వహణపై త్వరలోనే కమిటీని ఏర్పాటుచేసి వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

–సప్తశైల రాజేష్, మున్సిపల్ ఛైర్మన్, డోన్

ట్రాన్స్‌ఫార్మర్‌కు డబ్బులు చెల్లించాలి



గతంలో ఆమోదించిన విధంగా రూ.5 లక్షలను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఆ శాఖకు మున్సిపాలిటీ చెల్లించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. నిధులు లేవని దురుద్దేశంతో అధికారులు చేతులు ఎత్తివేయడం భావ్యం కాదు. మధ్యతరగతి ప్రజలు, క్రీడాకారుల అవసరాలు తీర్చేందుకు ఈ క్లబ్ హౌస్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

–మల్లికార్జునరెడ్డి, క్లబ్ సొసైటీ అధ్యక్షుడు, కౌన్సిలర్, డోన్

రాజకీయ కక్ష సరికాదు



స్పోర్ట్స్ కాంప్లెక్స్, క్లబ్‌హౌస్ అందరికీ ప్రయోజనకారంగా ఉంటుంది. కోట్లు వెచ్చించి కట్టిన ఈ భవనంలో కనీస సౌకర్యాల కల్పనకు రూ.18 లక్షలు మంజూరైనా కూడా కొందరు అడ్డుకోవడం దుర్మార్గం. రాజకీయ కక్ష్య సాధింపు చర్యలు మాని కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రజోపయోగకరమైన భవనాలను వినియోగంలోకి తెస్తే ప్రజలు హర్షిస్తారు.

–సోమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, డోన్

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

కోవెలకుంట్ల: స్థానిక గాంధీసెంటర్‌లో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజు గంగాయనం, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, పంచగవ్యమేళన, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పట్టణ శివారులోని పాటిమీద ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో మూడు రోజులపాటు నవశిర నాగేంద్ర, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.



పాటిమీద ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో పూజలు చేస్తున్న వేదపండితులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

డోన్ టౌన్: పట్టణ శివారులోని కేఈ కృష్ణమూర్తినగర్‌కు చెందిన చాకలి రంగన్న మృతిపై బాలకృష్ణ అభిమానుల సంఘం ఉపాధ్యక్షుడు మాధవ స్వామి సంతాపం తెలిపారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను కలిసి తన వంతు సాయంగా రూ.5 వేలు అందజేశారు.

నేటి నుంచి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

కోవెలకుంట్ల: పట్టణంలోని సంస్కృత పాఠశాల క్రీడామైదానంలో శనివారం నుంచి రాయలసీమ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పెద్దబాబు, మురళీమోహన్ తెలిపారు. రెండు రోజులపాటు జరిగే పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.15వేలు, రన్నర్స్ జట్టుకు రూ. 12 వేలు, తర్వాత వరుస బహుమతులుగా రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ. 5 వేలు ప్రధానం చేస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ జట్టు పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9989772668, 9985924204 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



కేంద్రీయ విద్యాలయం నూతన భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: కోట్లాది రూపాయలతో గత ప్రభుత్వం నిర్మించిన పలు ప్రభుత్వ భవనాల్లో మౌలిక వసతులు కల్పించాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డోన్ మండల ప్రజాపరిషత్, కేంద్రీయ విద్యాలయం, కియా నాలెడ్జ్ సెంటర్ భవనాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రూ.కోటి వ్యయంతో నిర్మించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనంలో ఏడాది గడిచినా తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీతో పాటు మౌలిక వసతులను కల్పించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్మించిన నూతన భవనాల్లో వచ్చే ఏప్రిల్ నెల నుంచి కేంద్రీయ విద్యాలయం ప్రారంభం కానున్నందు వల్ల వెంటనే మౌలిక వసతులు కల్పించేందుకు చొరవ చూపాలని కోరారు. పట్టణ శివారులోని గుత్తిరోడ్డులో నిర్మించిన గురుకుల పాఠశాల ప్రహరీని నిర్మించడంతో క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్‌లను వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో అనేక భవనాలు శిథిలమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, యువజన విభాగం అధ్యక్షుడు ఆర్ఈ రాజవర్ధన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, నాయకులు మల్యాల భాస్కర్‌రెడ్డి, ఓబులాపురం మదన్, ఎంపీటీసీ సుధాకర్ యాదవ్, బొబ్బల శివరామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లలిత

బనగానపల్లె రూరల్: మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మహిళాలు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పొందాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళాల సాధికారత లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చెప్పిన మాటలను గుర్తు చేశారు. దేశాన్ని పాలించే శక్తి మహిళలకు ఉందని ఇందిరా గాంధీ ద్వారా నిరూపితం అయ్యిందని తెలిపారు. పలు రంగాల్లో రాణించిన మహిళల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బడేసాహెబ్, ఎస్ఎండీ గౌస్, రామకృష్ణ, నాగరాజారెడ్డి, వరలక్ష్మీ, చంద్రకళ, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉచిత సినీ ప్రదర్శన

కోవెలకుంట్ల: అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం వివిధ పాఠశాలల విద్యార్థినులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా సినిమాను ప్రదర్శించారు. కోవెలకుంట్ల, సంజామల మండలాల్లోని ఆయా ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న సుమారు 300 మంది విద్యార్థినులు కోవెలకుంట్ల పట్టణంలోని ఎస్ఎల్‌వీ సినిమా థియేటర్‌లో 'నారీ' సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. నేటి సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. పిల్లల తల్లిదండ్రులు మగ పిల్లలతోపాటు ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు.



నారీ సినిమాను వీక్షిస్తున్న విద్యార్థినులు

కక్షసాధింపులు తప్ప అభివృద్ధి ఏదీ?



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలపై పెట్టిన శ్రద్ధ సంక్షేమ పథకాలపై పెడితే ప్రజల జీవితాలు బాగుపడుతాయని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. బనగానపల్లెలోని ఆయన నివాసంలో శుక్రవారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, అభివృద్ధి పనులను గాలికొదిలేసిందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ''సూపర్‌సిక్స్ పథకాలతో పాటు మేనిఫెస్టోలో పేర్కొన్న 143 హామీల గురించి పట్టించుకోలేదు. ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామన్నారు. ఇంత వరకు ఇవ్వకపోవడం శోచనీయం. తల్లికి వందనం కింద బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారు. గత ఏడాది బడ్జెట్‌లో కేటాయించినట్లు చూపారు. పైసా ఇవ్వలేదు. ఈ ఏడాది ఇస్తారో లేదో తెలియదు. అన్నదాతన సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామన్న రూ.20వేలు ఊసేలేదు. ఈ ఏడాది రూ.7, 200 కోట్లకు గాను బడ్జెట్‌లో రూ. 6,300 కోట్లు కేటాయించారు. కాగ్ నివేదిక ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మారే నాటికి రాష్ట్రం అప్పులు 6.46 లక్షల కోట్లు మాత్రమే. కాని చంద్రబాబు మాత్రం ఈ అప్పులు ఎక్కువగా చూపిస్తున్నారు. కూటమి 9 నెలల పాలనలో లక్ష నలబైవేల కోట్లు అప్పులు చేసింది. ఈ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో తెలియడం లేదు. ప్రజలకు మాయమాటలు చెబుతూ సీఎం చంద్రబాబు కాలయాపన చేస్తున్నారు. హామీల అములుపై మీడియా లేదా సోషల్‌మీడియాలో ఎవరైనా ప్రశ్నిస్తే వారి గొంతు నొక్కుతున్నారు. గత ప్రభుత్వంలో టన్ను ఇసుక రూ.550కు లభిస్తుండగా నేడు రూ.770కు విక్రయిస్తున్నారు. నాపరాతి పరిశ్రమ పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. యజమానులు ఇబ్బందులు పడుతున్నారని''తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అబ్దుల్ ఫైజ్, మనోహర్‌రెడ్డి, తోట బుచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి ఉన్నారు.

బనగానపల్లె రూరల్: పట్టణానికి చెందిన దస్తావేజు రైటర్ రామకృష్ణను మాజీ ఎమ్మెల్యే కాటసాని శుక్రవారం రాత్రి పరామర్శించారు. రామకృష్ణ హైదరాబాద్‌లో మోకాలికి శస్త్రచికిత్స చేయించుకుని ఇటీవల ఇంటికి రావడంతో ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అలాగే పట్టణంలోని 8వ వార్డు ఈద్గా నగర్ కాలనీకి చెందిన షేక్ రహీం(45) అనారోగ్యంతో మృతిచెందడంతో ఇంటి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు


కోవెలకుంట్ల: ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కోవెలకుంట్ల శివారులో కూలీలు పనిచేసే చోటకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..8 వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందడం లేదన్నారు. వేసవి కావడంతో పనుల వద్ద వసతులు కల్పించడం లేదని, కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడనిచ్చే టెంట్లు, మెడికల్ కిట్లు, తదితర సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 12న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు రాములమ్మ, సరోజ, శేఖర్, మహాలక్ష్మి, సుబ్బరాజు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

బేతంచెర్ల: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు (2025-06) ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ తెలిపారు. బేతంచెర్ల శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఉంటుందన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 30వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

భారీగా కలప స్వాధీనం

బేతంచెర్ల: మండల పరిధిలోని పెండేకల్లు పంచాయతీ రేపల్లె, వీరాయపల్లె అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించి వాహనం సహా 17 టన్నుల కలపను స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం కర్నూలు ఫారెస్టు రేంజ్ స్క్వాడ్ అధికారి రమణారెడ్డి తెలిపారు. రేపల్లె నుంచి చెట్లను నరికి వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. కాగా స్వాధీనం చేసుకున్న కలప వాహనాన్ని అటవీ కార్యాలయంలో కాకుండా బేతంచెర్లలోని ఓ ప్రైవేట్ స్థలంలో ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.



శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిపై వెళుతున్న వాహనదారుడు



రోడ్డు పక్కనున్న గుంత సమీపంలో ప్రమాదకరంగా వెళుతున్న బస్సు

ప్రమాదానికి అడుగు దూరం

కొలిమిగుండ్ల: కల్వటాల నుంచి కొలిమిగుండ్ల మధ్య వాహనదారులు బిక్కుబిక్కుమని ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రెండు చోట్ల శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలు, కూలిపోయిన రక్షణ గోడలు కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల రోడ్డుకు రెండు, మూడు అడుగుల దూరంలోనే గతంలో మట్టి తవ్వకాలు చేయడంతో పది అడుగుల మేర లోతు ఏర్పడ్డాయి. నెల్లూరు–ముంబై ప్రధాన రహదారి కావడంతో వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ ప్రాంతాల్లో తరచూ వాహనాలు అదుపు తప్పి కింద పడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇటీవల జమ్మలమడుగుకు చెందిన ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కనున్న పది అడుగుల గుంతలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేయడంతో 16 మందికి పైగానే గాయపడ్డారు. ఈమార్గంలో రాత్రి కంటే పగలే ప్రయాణం చేయడం వాహన చోదకులకు సవాల్‌గా మారుతుంది. ఏమాత్రం ఏమరు పాటు వహించినా క్షణాల్లో వాహనాలు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. వాహనదారులు సుదూరం నుంచి ప్రయాణించినా ఇక్కడికి వచ్చే సరికి చాలా జాగ్రత్తగా వెళుతుంటారు. బ్రిడ్జిల వద్ద ఇరువైపులా రాతి కట్టడాలు కడుతున్నా వారం తిరిగేలోపు మళ్లీ ఏదో ఒక వాహనం ఢీకొనడంతో పడిపోతున్నాయి. డాభానాయక్ బ్రిడ్జి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. బ్రిడ్జిలను పటిష్టం చేయడంతో పాటు రోడ్డు పక్కన గుంతలు ఉన్న చోట రైలింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు సంభవించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.